ప్రేమోన్మాది దాడి బాధితులకు బీఆర్ఎస్ అండ

- అనాథలైన బిడ్డలకు కేటీఆర్ భరోసా
- పార్టీ నుంచి రూ. 5 లక్షల ఆర్థిక సాయం

దీపిక, మదన్‌ను ఓదార్చుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చెన్నారావుపేట, జూలై 16 : వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పదహారు చింతల తండా గ్రామంలో ప్రేమోన్మాది చేతిలో దారుణహత్యకు గురైన గిరిజనకుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందుకు వచ్చారు. ప్రేమోన్మాది నాగరాజు చేసిన దాడిలో తల్లితండ్రులిద్దరూ శ్రీనివాస్, సుగుణ చనిపోవటంతో ఆ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు దీపిక, మదన్ అనాథలయ్యారు. దాడిలో తీవ్రంగా గాయపడి కోలుకున్న పిల్లలిద్దరినీ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం కేటీఆర్ వద్దకు తీసుకొచ్చారు. కేటీఆర్ వారి ఆరోగ్యం గురించి వాకబు చేసి ధైర్యంగా ఉండాలని చెప్పారు. దీపికా, మదన్‌ల చదువు బాధ్యత తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీలో వార్డు మెంబర్ అయిన సుగుణ బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త కావడంతో పార్టీ తరపున కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని చెప్పారు. ఈ కుటుంబానికి భరోసా ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 లక్షలు వారికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. నిందితుడు నాగరాజుకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకునేలా డీజీపీకి ఆదేశాలు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ కోరారు.

కోలా శ్రీను కుటుంబానికి అండగా ఉంటాం : కేటీఆర్

పాలకుర్తి రూరల్ : జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల గ్రామంలో కోలా శ్రీను (33) మృతితో అనాథలైన ముగ్గురు చిన్నారులకు అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. ఆ కుటుంబానికి వ్యక్తిగతంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కోలా శ్రీనుకు 12 ఏండ్ల క్రితం లలితతో వివాహమైంది. ముగ్గురు ఆడబిడ్డలు రక్షిత, రిషిత, రితిక జన్మించారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల శ్రీను అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందాడు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉండటంతో దహన సంస్కారాలు కూడా జరిపించలేని పరిస్థితి. దీంతో గ్రామస్థులు విరాళాలు సేకరించి దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి వడ్లకొండ వినయ్ ట్విట్టర్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. వారి కుటుంబాన్ని వ్యక్తిగతంగా ఆదుకుంటామని ట్విట్టర్ వేదికగా హామీ ఇచ్చారు. కేటీఆర్‌కు గ్రామస్థులు, బీఆర్ఎస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు.

భూ తగాదాతోనే దేవేందర్ హత్య

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- డీసీపీ రాజమహేంద్రనాయక్ వెల్లడి

నిందితుల అరెస్ట్ చూపుతున్న డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ, సీఐ

వర్ధన్నపేట, జూలై 16: భూ తగాదాతోనే సూదుల దేవేందర్ హత్య జరిగింది. రాయపర్తి మండలం బురహాన్‌పల్లిలో తాజా మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్(56)ను ఈ నెల 7న అతడి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్ వివరాలను వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో వరంగల్ వెస్ట్‌జోన్ డీసీపీ బీ రాజేమహేంద్రనాయక్ మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. బురహాన్‌పల్లి సమీపంలో మూడు ఎకరాల భూమిని ఎనబోతుల ప్రకాశ్ నుంచి దేవేందర్ కొనుగోలు చేసేందుకు గతంలో బయానా ఇచ్చాడు. కానీ, దేవేందర్ భూమి యజమానికి పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించలేదు. దీంతో ఈ భూమిని అదే గ్రామానికి చెందిన పల్లె మల్లేశ్ కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీంతో తాను కొనుగోలు చేయాల్సిన భూమిని కొనుగోలు చేశాడని మల్లేశ్‌పై 2022లో దేవేందర్ హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలో దేవేందర్‌తో పాటు సహకరించిన వారిపై కేసు నమోదు కాగా, జైలుకు వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో మల్లేశ్‌కు కొన్ని రోజుల క్రితం వ్యవసాయబావి వద్ద విద్యుత్ షాక్ తగలడంతో దేవేందరే ఇందుకు పాల్పడ్డాడని భావించిన మల్లేశ్ ఈ విషయాన్ని తన కుమారుడు పల్లె మురళికి తెలిపాడు. తనను ఎలాగైనా దేవేందర్ చంపుతాడని, మనమే అతడిని చంపుదామని కుమారుడితో చెప్పి నిర్ణయించుకున్నాడు. దేవేందర్‌ను హత్య చేసేందుకు మురళి తనకు తెలిసిన మహబూబ్‌నగర్ జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన చెన్ననాయుడు(26), హరిజన్ గోవింద్ (36)తోపాటు మరికొంతమందితో కలిసి ఈ నెల 7న ఇంట్లో దేవేందర్ ఒక్కడే ఉన్న సమయంలో వెళ్లి సుత్తెతో తలపై బలంగా కొట్టి చంపాడు. మంగళవారం పల్లె మల్లేశ్, చెన్ననాయుడు, గోవింద్ వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు పల్లె మురళితో పాటు అతడికి సహరించిన మరికొందరి కోసం గాలిస్తున్నట్లు వివరించారు. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీసీపీ తెలిపారు.

సీతానగరం బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో వానకాలం సైతం కిందనే కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

ఏ కాలమైనా ఆరుబయటే తిండి..

గూడూరు, జూలై16 : ఎండకాలం, వానకాలం, చలికాలం.. ఇలా ఏ కాలమైనా ఆ విద్యార్థులకు టిఫిన్, భోజనం పాఠశాల ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో కిందనే కూర్చొనే తినాలి. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో 411 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి భోజనం చేయడానికి సరైన గదులు లేక ఇలా వానకాలంలో పాఠశాల ప్రాంగణం బురదమయమైనా నేలపైనే కొంతమంది కూర్చుని తింటుండగా, మరికొంతమంది బురద ఉండడంతో చెప్పులపై కూర్చుని భోజనం చేస్తున్నారు. ఈ పాఠశాలలో వంటగది కూడా పరిశుభ్రంగా లేదు. అధికారులు స్పందించి వంటగది, భోజనశాల నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనల పేరుతో రైతులకు అన్యాయం చేయొద్దు

రుణమాఫీపై రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ చందర్‌రావు



మోర్తాల చందర్‌రావు

కాశీబుగ్గ, జూలై 16: నిబంధనల పేరుతో రుణమాఫీలో రైతులకు అన్యాయం చేయొద్దని రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హనుమకొండలో నిర్వహించిన రైతు డిక్లరేషన్ బహిరంగ సభలో రాహుల్‌గాంధీ ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ రైతాంగాన్ని ఎంతగానో ఆకర్షించిందని తెలిపారు. రైతులు, కౌలురైతులు ఓట్లేసి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే నిబంధనల పేరుతో కొందరు రైతులను రుణమాఫీకి అనర్హులుగా చేయడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల్లో రైతులకు అన్యాయం జరిగేలా ఉందని తెలిపారు. రేషన్‌కార్డు ప్రాతిపదిక అంటే పదేళ్లలో వేరుపడిన కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదని, మరికొందరు రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు లేనందున బంగారం తాకట్టుపెట్టి పంట రుణాలు తీసుకున్నారని, మరికొందరు పంటలు నష్టపోయిన సమయంలో ప్రభుత్వాల ఆదేశాలతో బ్యాంకర్లు రైతుల రుణాలను రీషెడ్యూల్ చేసుకున్నట్లు వివరించారు. ఇప్పుడు ప్రభుత్వం బంగారంపై తీసుకున్న రుణాలు, రీషెడ్యూల్ చేసిన రుణాలు, వేరుపడ్డ కొత్త రైతుల రుణాలు పరిగణలోకి తీసుకోకపోతే వారందరికీ తీవ్రఅన్యాయం జరుగుతుందని ప్రభుత్వం గుర్తించాలని తెలిపారు. ఆయా నిబంధనలను వెంటనే సవరించాలని కోరారు.

మోరంచపల్లి బ్రిడ్జికి ప్రమాద సూచిక

నీటిపారుదల శాఖ అధికారుల అలర్ట్

మోరంచ బ్రిడ్జికి ప్రమాద సూచిక బోర్డు పెట్టిన అధికారులు

జయశంకర్ భూపాలపల్లి, జూలై 16 (నమస్తే తెలంగాణ) : వర్షాలు ప్రారంభం కావడంతో మోరంచ వరద ఉధృతి పెరిగే అవకాశం ఉండడంతో నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గత ఏడాది జూలైలో మోరంచ ఉప్పొంగడం, చెరువులు తెగిపోవడంతో మోరంచపల్లి గ్రామం నీట మునిగింది. ప్రాణ, ఆస్తి నష్టం జరిగిన విషయం తెలిసిందే. ఈ విషయమై సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'మోరంచపల్లి భద్రమేనా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన నీటి పారుదలశాఖ అధికారులు మోరంచపల్లి గ్రామం సమీపంలో ఉన్న మోరంచ బ్రిడ్జికి ప్రమాద సూచికను ఏర్పాటు చేశారు. గ్రీన్, ఎల్లో, ఆరెంజ్, రెడ్ లైన్లతో బ్రిడ్జి కింది భాగంలో వరద ప్రవాహాన్ని తెలుసుకునేలా మార్కింగ్ చేశారు. గ్రీన్ లైన్ (వార్నింగ్ లెవల్ 1), ఎల్లో (వార్నింగ్ లెవల్ 2), ఆరెంజ్ (డేంజర్ లెవల్ 1), రెడ్ లైన్ (డేంజర్ లెవల్ 2)గా మార్కింగ్ చేశారు. వరద ప్రవాహం ఎల్లో లైన్ దాటితే గ్రామస్తులను అప్రమత్తం చేయడానికి వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.

వీఫాల్స్‌కు రావొద్దు

సందర్శనను నిలిపివేసిన అధికారులు

చెక్‌పోస్టు వద్ద పహారా కాస్తున్న అటవీశాఖ అధికారి, వెనుదిరుగుతున్న పర్యాటకులు

వాజేడు, జూలై 16 : మండలంలోని కొంగాల అటవీప్రాంతంలో ఉన్న వీఫాల్స్ (దూసపాటిలొద్ది) జలపాతం సందర్శనను అటవీశాఖ అధికారులు నిలిపివేశారు. అక్కడ తరచూ ప్రమాదాలు జరిగి పర్యాటకులు మృతి చెందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జలపాతానికి వెళ్లే జగన్నాథపురం గ్రామశివారు 163 జాతీయ రహదారి పక్కన కొంగాల క్రాస్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. పర్యాటకులు ఎవరూ వెళ్లకుండా అధికారులు పహారాకాస్తున్నారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులను అటవీశాఖ అధికారులు అడ్డుకొని వారికి నచ్చజెప్పి వెనక్కి పంపారు.

లైసెన్స్ లేకుండా వైద్యశాల నిర్వహణ

తనిఖీ చేసి నోటీసులు జారీ చేసిన ములుగు డీఎంహెచ్‌వో

జ్వరం వచ్చిన బాలుడితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ఏటూరునాగారం, జూలై 16 : మండల కేంద్రంలోని పాషా, ఆరాధ్య ప్రైవేట్ దవాఖానలు మంగళవారం డీఎంహెచ్‌వో అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరాధ్య వైద్యశాలలో లైసెన్స్ లేకుండానే ఓపీ చూస్తున్న తీరుపై డీఎంహెచ్‌వో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని డాక్యుమెంట్లు ఉంటే వెంటనే అనుమతి తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఇదిలా ఉండగా పాషా వైద్యశాలను తనిఖీ చేయగా అనేక లోపాలు ఉన్నట్లు గుర్తించారు. రిసెప్షన్ వద్ద వసూలు చేసే చార్జీల జాబితా పెట్టక పోవడం, అనుమతి పొందిన వాటి కంటే ఎక్కువ బెడ్స్‌ను వినియోగించడం, పరిశుభ్రత పాటించకపోవడంపై నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ మంగపేట మండలం మల్లూరు నుంచి వచ్చిన జ్వర పీడితులు చికిత్స పొందుతున్నట్లు గుర్తించారు. వారితో మాట్లాడగా ఒకే గ్రామం నుంచి నలుగురు వచ్చినట్లు చెప్పడంతో వెంటనే మల్లూరులో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని అక్కడి వైద్యులను ఆదేశించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. ఆర్ఎంపీలు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రైవేట్ వైద్యశాలలకు పంపించడం వల్ల అవసరంలేని పరీక్షలు చేసి వారిని ఆర్థికంగా కుంగదీస్తున్నారన్నారు. త్వరలో ప్రైవేట్ వైద్యులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేస్తారని తెలిపారు.

ఐలోనికి నాలుగోసారి రూ.1.15 కోట్లు

ఐనవోలు, జూలై 16 : ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ఆదాయం నాలుగోసారి రూ. కోటి దాటింది. మంగళవారం 109 రోజులకు సంబంధించి 18 హుండీలను లెక్కించగా రూ. 24,93, 422 ఆదాయం వచ్చింది. ఇదే సమయంలో టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 90,77,405 సమకూరింది. మొత్తంగా రూ.1,15,70,827 వచ్చినట్లు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ లెక్కింపునకు పరిశీలకులుగా ఎండోమెంట్ నుంచి జీ సంజీవరెడ్డి, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ ఓం ప్రకాష్, మహబూబాబాద్‌లోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర సేవా సమితి, అర్చకులు, సిబ్బంది కిరణ్, మధూకర్, శ్రీకాంత్, కన్నయ్య, రాజు తదితరులు వ్యవహరించారు.

ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైద్యులు

- ఐదు రోజులుంచుకొని ఎలాంటి చికిత్స చేయలేదు
- డాక్టర్లు, సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి
- భూపాలపల్లి కలెక్టర్, ఎమ్మెల్యేను కోరిన బాధితురాలి కుమారుడు

సాగి స్వరూప

భూపాలపల్లి రూరల్, జూలై 16 : వైద్యం చేస్తున్నట్లు నటిస్తూ పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న భూపాలపల్లి ప్రధాన దవాఖాన వైద్యులు, సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఓ బాధితురాలి కొడుకు అరవింద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామానికి చెందిన తన తల్లి సాగి స్వరూపకు తీవ్ర గాయాలై ఈ నెల 10న ఆస్పత్రిలో చేరిందని, అప్పటి నుంచి శ్వాస ఆడడం లేదని, విపరీతంగా తల నొప్పి ఉందని, బెడ్ పై పడుకోలేకపోతున్నదని డాక్టర్లకు చెప్పినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ విషయాన్ని సూపరింటెండెంట్ నవీన్ కుమార్‌కు చెప్పినా ఫలితం లేదన్నారు. పూర్తిగా నయమైందని 14న తన తల్లిని డిశ్చార్జ్ చేశారని, ఇంటికి తీసుకెళ్లిన తర్వాత ఇబ్బంది పడుతుంటే హన్మకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చూపిస్తే బొక్కలు విరిగి సీరియస్‌గా ఉందని తెలిపారన్నారు. తన తల్లిని ఐదు రోజులపాటు ఆస్పత్రిలో ఉంచుకొని ఎలాంటి ట్రీట్మెంట్ ఇవ్వకుండానే ఇస్తున్నట్లు నటించారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్, ఎమ్మెల్యే, మంత్రి స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అరవింద్ కోరారు.

సంక్షిప్త వార్తలు

స్విగ్గీ, జొమాటోలో మద్యం డోర్ డెలివరీ!

న్యూఢిల్లీ, జూలై 16: నచ్చిన ఫుడ్‌ను స్విగ్గీ, జొమాటోలలో తెప్పించుకున్నట్టే.. ఇకపై మద్యాన్ని (పరిమిత స్థాయిలో) కూడా డోర్ డెలివరీ ద్వారా తెప్పించుకునే రోజు త్వరలో రాబోతున్నది. మనకు నచ్చిన మద్యం బ్రాండ్‌ను ఆన్‌లైన్ యాప్‌లో ఆర్డర్ చేసి పొందవచ్చు! న్యూఢిల్లీ, కర్ణాటక, హర్యానా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళలలో పైలట్ ప్రాజెక్ట్ కింద అమలుజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ-కామర్స్ సంస్థలతో మద్యం తయారీ సంస్థలు చర్చలు జరుపుతున్నాయని పరిశ్రమ వర్గాలు మంగళవారం మీడియాకు వెల్లడించాయి.

భారత మార్కెట్‌లోకి ఒబెసిటీ డ్రగ్ టర్‌జెపటైడ్!

న్యూఢిల్లీ, జూలై 16: బరువు తగ్గటంలో అద్భుత ఔషధంగా భావిస్తున్న 'టర్‌జెపటైడ్' ఔషధం.. త్వరలో భారత్‌లోనూ అందుబాటులోకి రాబోతున్నది. భారత్‌లో ఈ ఔషధం అమ్మకాలకు సంబంధించి ఫార్మా కంపెనీ 'ఇలి లిల్లీ'కి కేంద్రం త్వరలోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నది. ఈ ఔషధాన్ని ఇండియాలో టైప్-2 డయాబెటిస్ రోగుల చికిత్స కోసం ప్రధానంగా వాడాలని సూచిస్తున్నా, ఒబెసిటీతో బాధపడుతున్న వారికి దీనిని ఉపయోగించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఔషధాన్ని పెద్ద మొత్తంలో తీసుకున్న రోగుల్లో సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయని ప్రపంచవ్యాప్తంగా జరిగిన క్లినికల్ ట్రయల్స్ చెబుతున్నాయి. భారత్‌లోని డ్రగ్ రెగ్యులేటరీ నిపుణుల కమిటీ కొద్ది రోజుల క్రితం 'టర్‌జెపటైడ్' ఔషధం అమ్మకాలకు ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు సమాచారం.

అనారోగ్యకర ఆహారాన్ని నిషేధించండి: యూజీసీ

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థలలో అనారోగ్యకరమైన ఆహార పదార్థాల అమ్మకాన్ని నిషేధించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల కారణంగానే ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఐసీఎంఆర్ నివేదికలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. వీటితో పాటు పలు అసంక్రమిత వ్యాధులకు కూడా ఇవి హేతువుగా మారుతున్నాయని తెలిపింది.

'డ్యూటీలో ముస్లింలు గడ్డంతో ఉండటం తప్పకాదు'

చెన్నై: మతాచారాలకు అనుగుణంగా గడ్డం కలిగి ఉండటం తప్పేమీ కాదని, అలా ఉన్న పోలీసులపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు చేపట్టవద్దని మద్రాస్ హైకోర్టు తమిళనాడు పోలీస్ శాఖను ఆదేశించింది. ఈ సందర్భంగా న్యాయస్థానం 1957 మద్రాస్ పోలీస్ గెజిట్ 1957ను ప్రస్తావిస్తూ ముస్లింలు విధి నిర్వహణలో గడ్డాలతో ఉండవచ్చునని, అయితే కత్తిరించిన, చక్కనైన గెడ్డాలతో ఉండాలని ఆదేశించింది. మక్కా నుంచి వచ్చిన తర్వాత గెడ్డంతో డ్యూటీకి హాజరైన ఒక కానిస్టేబుల్‌పై అధికారులు చర్య తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు గడ్డంతో విధులకు హాజరవ్వటంలో ఎలాంటి తప్పులేదని స్పష్టం చేశారు.

పవిత్ర సరస్సు వద్ద అక్రమంగా ఆలయం

డెహ్రాడూన్, జూలై 16: ఉత్తరాఖండ్‌లోని సుధేర్‌దుంగ నది లోయలో స్వయం ప్రకటిత బాబా చైతన్య ఆకాశ్ అక్రమంగా గుడి నిర్మించారని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పవిత్ర దేవి కుండ్ సరస్సులో స్నానం చేసి ఆయన దాన్ని అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల కథనం ప్రకారం చైతన్య ఆకాశ్ కొందరు స్థానికులను సముదాయించి వారి సాయంతో సున్నిత పర్యావరణ జోన్‌లో ఆలయాన్ని నిర్మించారు. కలలో దేవుడిచ్చిన ఆదేశాల మేరకే దాన్ని నిర్మించినట్టు ఆయన చెప్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదుపై భాగేశ్వర్ జిల్లా మెజిస్ట్రేట్ పోలీస్ దర్యాప్తుకు ఆదేశించారు.

సేఫ్ జోన్‌పై ఇజ్రాయెల్ దాడి..60 మంది మృతి

జెరూసలేం: దక్షిణ, మధ్య గాజా ప్రాంతాలపై సోమవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన వైమానిక దాడుల్లో 60 మందికిపైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది పాలస్తీనా పౌరులు ఆశ్రయం పొందిన 'సేఫ్ జోన్'లోని టెంట్లను సైతం ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యంగా చేసుకుంది. మంగళవారం ఖాన్‌యూనిస్ దక్షిణ ప్రాంతంపై బాంబుల మోత మోగించింది. శరణార్థుల కోసం ఏర్పాటుచేసిన టెంట్లను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుందని, దీంతో ఇక్కడ 17 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని నాజర్ దవాఖాన వర్గాలు ప్రకటించాయి. ఖాన్ యూనిస్ పశ్చిమ యూనిట్ నావల్ కమాండర్‌ను లక్ష్యంగా చేసుకొని మాత్రమే బాంబు దాడులు చేపట్టామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

మళ్లీ చలో ఢిల్లీ

మరోసారి ఢిల్లీ ర్యాలీకి సిద్ధమైన రైతు సంఘాలు

- శంభు వద్ద బారికేడ్లను తొలగించగానే ముందుకు
- డిమాండ్లు సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదు
- బీకేయూ నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ స్పష్టీకరణ

చండీగఢ్/ఛత్రపతి శంభాజీనగర్, జూలై 16: దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతుల 'ఢిల్లీ చలో' సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో హర్యానాలో అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఇతర దిగ్బంధనాలను తొలగించిన తర్వాత.. మరోసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టేందుకు రైతు సంఘాలు సిద్ధమయ్యాయి. శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిని తెరిచిన వెంటనే రైతులు మళ్లీ చలో ఢిల్లీ చేపడుతారని భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా సిద్ధూపూర్, సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్) నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ మంగళవారం వెల్లడించారు. పంటలకు కనీస మద్దతు ధర, ఇతర డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు రైతాంగ ఉద్యమం ఆగేది లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని శంభు సరిహద్దు వద్ద రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలని పంజాబ్-హర్యానా హైకోర్టు ఇటీవల హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో దల్లేవాల్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఫిబ్రవరిలో ఎస్కేఎం(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో'ను పోలీసులు పంజాబ్-హర్యానాలోని శంభు సరిహద్దు వద్ద అడ్డుకోవడంతో ఆ నెల 13 నుంచి రైతులు అక్కడే బైఠాయించి ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో..

ర్యాలీగా ఢిల్లీ చేరిన తర్వాత జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో శాంతియుత ఆందోళనలు కొనసాగిస్తామని జగ్జిత్ సింగ్ దల్లేవాల్ వెల్లడించారు. బారికేడ్ల తర్వాత తాము కొనసాగించే ర్యాలీని మళ్లీ అడ్డుకొన్నా, రోడ్డును దిగ్బంధించినా ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చిలో ఆందోళనల సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన నవదీప్ సింగ్‌కు సంఘీభావంగా బుధ, గురువారాల్లో శాంతియుత ఆందోళనలు చేపడుతామని తెలిపారు. నవదీప్ సింగ్‌పై పోలీసులు అల్లర్లు, హత్యాయత్నం వంటి తీవ్రమైన అభియోగాలు మోపారు. హైకోర్టు ఆదేశాలను హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయడంపై దల్లేవాల్ స్పందిస్తూ.. రోడ్డును బ్లాక్ చేసింది ప్రభుత్వమేనని, రైతులు కాదని అన్నారు. ఫిబ్రవరిలో రైతులు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో మరణించిన రైతు శుభకరణ్ సింగ్ మృతిపై దర్యాప్తునకు ఏర్పాటు చేసిన కమిటీపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

ఎంఎస్పీ పెంచక ఇబ్బందుల్లో చక్కెర పరిశ్రమ

కేంద్ర ప్రభుత్వం గత ఐదేండ్లుగా మద్దతు ధరను పెంచకపోవడంతో దేశంలోని చక్కెర పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని షుగర్ యూనిట్స్ ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ డైరెక్టర్ జైప్రకాశ్ దండేగోంకర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రం త్వరితగతిన నిర్ణయాలు తీసుకోకపోవడంతో షుగర్ ఇండస్ట్రీలో వర్కింగ్ క్యాపిటల్‌లో స్వల్ప మార్జిన్లు, అప్పులు వంటి సమస్యలు మళ్లీ తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చెరకు ఎఫ్ఆర్‌పీని మూడుసార్లు పెంచిందని, అయితే చక్కెరకు ఎంఎస్పీని పెంచలేదని పేర్కొన్నారు. గత ఐదేండ్లుగా అన్ని రాష్ట్రాల ఫెడరేషన్లు డిమాండ్ చేస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేదని విమర్శించారు. చెరకు, రవాణా, లేబర్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో చక్కెర ఉత్పత్తి ఖర్చుగా కేజీకి కనీసం రూ.41 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఒమన్ తీరంలో ఓడ బోల్తా

- 16 మంది ఆచూకీ గల్లంతు
- వీరిలో 13 మంది భారతీయులు

మస్కట్, జూలై 16: ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్లతో ప్రయాణిస్తున్న ప్రెస్టీజ్ ఫాల్కన్ అనే ఓడ సోమవారం బోల్తా పడింది. ఈ ఓడలో ఉన్న 16 మంది సిబ్బంది గల్లంతయ్యారని ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్(ఎంఎస్‌సీ) తెలిపింది. ఇందులో 13 మంది భారతీయులు కాగా, మరో ముగ్గురు శ్రీలంకకు చెందిన వారుగా గుర్తించారు. వీరి ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నది. కొమొరోస్‌కు చెందిన ఈ ఓడ యెమన్‌లోని ఓడరేవు నగరమైన ఏడెన్‌కు వెళ్తున్నట్టు తెలిసింది. రాస్ మద్రకహ్‌కు ఆగ్నేయం వైపు 25 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ఓడ బోల్తా పడటానికి కారణం ఇంకా తెలియరాలేదు. ఓడ ఆచూకీ కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి.

మస్కట్‌లో మసీదు వద్ద కాల్పులు.. భారతీయుడు మృతి

మసీదు లక్ష్యంగా ఒమన్ రాజధాని మస్కట్‌లో దుండగులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒకరు భారతీయుడు, నలుగురు పాకిస్థానీయులు ఉన్నారు. కాల్పులకు పాల్పడ్డ వారిలో ముగ్గురు దుండగులను కాల్చి చంపినట్టు పోలీసులు తెలిపారు. వాడీ కబీర్ ప్రాంతంలోని ఇమామ్ అలీ మసీద్ బయట సోమవారం రాత్రి స్థానికులు మతపరమైన వేడుక జరుపుకుంటుండగా ఈ కాల్పులు జరిగాయి. మృతి చెందిన భారతీయుని కుటుంబానికి సహాయ సహకారాలను అందించనున్నట్టు భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

కూలీలుగా వేషం మార్చి.. దొంగల ముఠా ఆట కట్టించి

- పుణె పోలీసుల రహస్య ఆపరేషన్
- చోరీకి గురైన 100 బైకులు స్వాధీనం

ముంబై, జూలై 16: వ్యవసాయ కూలీలుగా మారు వేషం ధరించిన పోలీసులు, పుణె చుట్టుపక్కల వాహనాల్ని దొంగలిస్తున్న ముఠాను అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. గత ఏడాది మార్చి-ఏప్రిల్‌లో పుణె పోలీస్ క్రైం బ్రాంచ్‌లోని ఏడుగురు సభ్యులు రహస్య ఆపరేషన్ చేపట్టి.. దొంగల ముఠాలో ప్రధాన వ్యక్తి అజయ్ రమేశ్ షిండేను పట్టుకున్నారు. దొంగతనం చేసిన 100 బైకులను స్వాధీనం చేసుకొని.. నెల రోజులపాటు ఆరా తీయగా, ఓ కామర్స్ గ్రాడ్యుయేట్ నేతృత్వంలో నలుగురు వ్యక్తులు గ్యాంగ్‌గా ఏర్పడి చేస్తున్న తతంగం బయటపడింది. దొంగలించిన వాహనాల్ని దారాశివ్, లాతూర్, బీడ్ జిల్లాల్లో గ్రామస్థులకు అమ్ముతున్నట్టు పోలీసు విచారణలో తేలింది. రహస్య ఆపరేషన్‌లో భాగంగా కూలీలుగా మారిన పోలీసులు.. పొలాల్లో వంట చేసుకుంటూ, స్థానికులతో కలిసి కొన్ని సార్లు కూలి పనులకు కూడా వెళ్లారని తెలిసింది.

యూపీలో ముదురు జంట ప్రేమ

10 మంది పిల్లలున్న వ్యక్తితో ఆరుగురు సంతానం ఉన్న మహిళ జంప్

కాస్‌గంజ్: ప్రేమ గుడ్డిది అంటుంటారు. ఇది యువత విషయంలో నిజమైనా.. తాము కూడా తక్కువ కామని యూపీలో ఒక ముదురు ప్రేమజంట నిరూపించింది. సాక్షాత్తూ పెళ్లయ్యి 10 మంది పిల్లలున్న వ్యక్తి... పెళ్లయ్యి ఆరుగురు సంతానం ఉన్న మరో మహిళతో కలిసి ప్రేమాయణం సాగించి ఇద్దరూ జంప్ కావడం ఆశ్చర్యమైతే.. ఆ మహిళ తన కుమారుడి కాబోయే అత్త కావడం మరో ట్విస్టు. యూపీలోని కాస్‌గంజ్‌లో కూలిపని చేసుకునే వ్యక్తి, ఈ-రిక్షా డ్రైవర్‌గా చేసే షకీల్ 28 ఏండ్లుగా స్నేహితులు. తన కుమారుడికి అతని కుమార్తెనిచ్చి చేద్దామని షకీల్ అడగడంతో ఆయన కూడా అంగీకరించాడు. జూన్ 17న వివాహం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో షకీల్, స్నేహితుని భార్య తరచూ మాట్లాడుకునే వారు. ఈ లోగా ఇరు కుటుంబాలకు షాక్ ఇస్తూ జూన్ 3న షకీల్, పెళ్లికుమార్తె తల్లి(35) లేచిపోయారు. 10 మంది సంతానం ఉన్న షకీల్, ఆరుగురు పిల్లలున్న పెండ్లి కుమార్తె తల్లి ఇలా చేయడం చూసి బంధువులు, చుట్టుపక్కల వారు ముక్కున వేలుసుకున్నారు. కాగా, పెండ్లి కుమార్తె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారిద్దరూ ఈ ముదురు ప్రేమ జంట కోసం గాలిస్తున్నారు.

సైబర్ నేరగాళ్ల నుంచి ఇలా రక్షణ!

ఐఫోన్ యూజర్లకు యాపిల్ సూచనలు

న్యూఢిల్లీ, జూలై 16: సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో మోసగాళ్ల వలకు చిక్కకుండా ఉండేందుకు ఐఫోన్ వినియోగదారులకు యాపిల్ సంస్థ పలు సూచనలు చేసింది. ఈ మేరకు కంపెనీ సెక్యూరిటీ డాక్యుమెంట్‌ను అప్‌డేట్ చేసింది. యాపిల్ సూచించిన జాగ్రత్తలు ఇవీ..

1. మోసపూరిత ఈమెయిళ్లను గుర్తించేందుకు గానూ ఈమెయిల్‌కు స్పందించే ముందు అది ఏ మెయిల్ ఐడీ నుంచి వచ్చిందనేది ధ్రువీకరించుకోవాలి.
2. 'మీ ఫోన్‌లో సెక్యూరిటీ సమస్య ఉంది' అంటూ వచ్చే పాప్‌అప్ యాడ్లను క్లిక్ చేయవద్దు. ఇవి చాలా వరకు మోసపూరితమైనవి అయ్యే అవకాశం ఉంది.
3. 'యాపిల్ సపోర్ట్' పేరుతో మోసగాళ్లు ఫోన్లు, మెసేజ్‌లు చేయవచ్చు. వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలి.
4. ఉచితంగా లేదా ఏదైనా బహుమతి వచ్చిందని వచ్చే ప్రకటనలను నమ్మి మోసపోవద్దు.
5. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే 'క్యాలెండర్ ఇన్‌వైట్'లను తిరస్కరించాలి.
6. పాస్‌వర్డ్‌లు, సెక్యూరిటీ కోడ్‌లను తెలియని వెబ్‌సైట్‌లలో ఎంటర్ చేయొద్దు.
7. యాపిల్ ఐడీకి టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ పెట్టుకోవాలి. కాంటాక్ట్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.
8. సాఫ్ట్‌వేర్‌ను కేవలం నమ్మకమైన మార్గాల్లో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి.

నీతి ఆయోగ్ పునర్వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ, జూలై 16: కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం మంత్రి మండలిలో మార్పుల తర్వాత మంగళవారం నీతి ఆయోగ్‌ను పునర్వ్యవస్థీకరించింది. ఇందులో చైర్ పర్సన్‌గా ప్రధాని నరేంద్ర మోదీ కొనసాగుతారు. వైస్‌చైర్మన్, పూర్తికాల సభ్యుల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవు. వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కొత్త ఎక్స్ అఫీషియో సభ్యునిగా చేర్చగా, ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని నీతి ఆయోగ్‌లో భాగస్వాములను చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సవరించిన కూర్పు తర్వాత సుమన్ కే బెర్రీ వైస్‌చైర్మన్‌గా, వీకే సారస్వత్, రమేశ్ చంద్, వీకే పాల్, అరవింద్ విర్మనీలు పూర్తికాల సభ్యులుగా కొనసాగుతారు.

పూజా ఖేద్కర్ శిక్షణ నిలుపుదల



ముంబై, జూలై 16 (నమస్తే తెలంగాణ): ఇటీవల వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. అడ్డదారుల్లో ఆమె ఐఏఎస్ ఉద్యోగం సంపాదించారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ట్రైనీ ఐఏఎస్‌గా మహారాష్ట్రలో వెంటనే శిక్షణను నిలిపివేసి జూలై 23లోపు తిరిగి ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు వెనక్కి రావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు పుణే కలెక్టర్ తనను వేధిస్తున్నారని ఖేద్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.